
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

**MAY-2012**

సంవత్సర చందా రూ.50/-

## క్రీస్తు సంఘములు సమర్పించు

## సత్యవాణి టి.వి. ప్రసారములు

ప్రతి ఆదివారం సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త

ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ

ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ

ప్రతి శనివారం ఉదయం 8.00 గం॥లకు ఆరాధన

ఛానల్‌లలో వీక్షించండి.

ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆ కోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును.


మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్ నెం. 80,**

**కాకినాడ. ఎ.పి.**

**533 001.**

**ఫోన్ : 0884 - 2363722**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | మే - 2012 | సంచిక - 10


## పరిశుద్ధాత్ముని వ్యక్తిత్వము
## (Personality of the Holy Spirit)

పరిశుద్ధాత్మ దేవుని గూర్చి నేటి క్రైస్తవలోకములో వివిధ భావములు కలవు. ఆయన యొక్క వ్యక్తిత్వమును గూర్చియే గాక ఆయన పనిని గూర్చి కూడ అనేక రీతులగా అపార్థము చేసికొను చున్నారు. అయితే వచ్చే కొద్ది పాఠములలో పరిశుద్ధాత్మను గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నదో తెలిసికొందము గాని ఇప్పుడు ఆయన వ్యక్తిత్వమును గూర్చి తెలిసికొందము.

పరిశుద్ధాత్ముడనగా ఆదిలో దేవుడు సమస్తమును సృష్టించినప్పుడు ఉపయోగించిన శక్తి యన్ని కొందరు అనుకొందురు. మరికొందరు దేవుని నుండి నిత్యము బయలు వెడలు శక్తి యని అనుకొందురు. అయితే తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవునివలె పరిశుద్ధాత్ముడుదేవుడై యున్నారని, ఆయన వ్యక్తిత్వము (Personality) గలవాడని బైబిలు బోధించు చున్నది. ఈ ముగ్గురు మూడు దేవుండ్లు గాక ఒకే దేవుడై యున్నారని బైబిలు బోధించుచున్నది.

తండ్రి, కుమారులవలె పరిశుద్ధాత్ముడు ఆరాధింప బడవలెను, పూజింపబడవలెను, ప్రేమింప బడవలెను, మరియు లోబడ వలెను అని దైవవేదము బోధించుచున్నది. అట్లుగాక పరిశుద్ధాత్ముని వేరేవిధముగ మనము పరిగణించినయెడల దేవదూషణ యగును.

పరిశుద్ధాత్ముడు తండ్రి, కుమారుల వలె ప్రత్యేకవ్యక్తిత్వమును కలిగి యున్నారు. అయితే వ్యక్తిత్వమనగా యేమిటి ?యని మీరడుగవచ్చును. ఒక వ్యక్తి యొక్క జీవము, మేధస్సు, ఇచ్ఛ, వాంఛ, క్రియ, వ్యక్తిగత తత్వము, ప్రవర్తన , ప్రభావములే ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వమని మనము చెప్పుకొనవచ్చును. పరిశుద్ధాత్మునిలో ఈ లక్షణములన్నియును కలవని బైబిలు బోధించుచున్నది. అందు వలన ఆయన కేవలము శక్తి కాదు. ఒక ప్రభావము లేక గుణము కాదు గాని త్రియేక దేవునిలో ఒక వ్యక్తియై యున్నారు.

పరిశుద్ధాత్ముడు వ్యక్తిగత సర్వ నామ ముతో సంబోధింపబడుటలో ఆయన వ్యక్తి త్వము బయలుపడుచున్నది: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతు లను మీకు తెలియజేయును" అని యేసు యోహాను 16:13లో పలికెను. ఇక్కడ పరిశుద్ధాత్ముని 'ఆయన' యను సర్వనామ ముతో క్రీస్తు సంబోధించినట్లు చూడ గలము. పరిశుద్ధాత్ముడు శక్తి కాదు గాని ఒక వ్యక్తియైయున్నారు.

పరిశుద్ధాత్ముని లక్షణములను బట్టి మనము ఆయన వ్యక్తిత్వమును తెలిసి కొనగలము. పరిశుద్ధాత్ముడు చిత్తమును గలవాడు: "అయినను వీటినన్నిటిని ఆ ఆత్మ యొక్కడే తన చిత్తము చొప్పున ప్రతి వానికి పంచియిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" అని 1 కొరింధి 12:11లో వ్రాయబడియున్నది. ఆయన ఆలోచించునట్టి మనస్సుకలవాడని రోమా 8:27 వలన మనకు అర్ధమగుచున్నది. ఆయన జ్ఞానముగల వాడని 1 కొరింధి 2:10-11 వలన తెలియుచున్నది. ఆయన ఇచ్ఛను కలిగినవాడని అపొ.కా. 16:7 వలన తెలియుచున్నది.

పరిశుద్ధాత్ముని క్రియలనుబట్టికూడ మనము ఆయన వ్యక్తిత్వమును గ్రహించు కొనగలము. ఆయన మాట లాడును: "అయితే కడవరి దినములో కొందరు.... విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" అని 1 తిమోతి 4:1-2లో వ్రాయబడి యున్నది. ఆయన సాక్ష్య మిచ్చును : "సత్యస్వరూపియైన ఆత్మ వచ్చి నప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్య మిచ్చును" అని యేసు చెప్పెను (యోహాను

15:26). ఆయన బోధించును, జ్ఞాపకము చేయును అని యోహాను 14:26లో వ్రాయబడి యున్నది. ఆయన మర్మములను పరిశోధించువాడని 1 కొరింథి 2:10 లో వ్రాయబడి యున్నది. ఆయన విజ్ఞాపనము చేయునని రోమా 8:26, 27లో వ్రాయబడియున్నది. ఆయన అజ్ఞాపించును, నిషేధించును అని అపో. కా. 13:2 లోను, 16:6-7 లోను వ్రాయబడియున్నది. మరీ ముఖ్యముగా ఆయన పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయునని యోహాను 16:8లో వ్రాయబడి యున్నది. పరిశుద్ధాత్ముని మీరు దు:ఖపరచకుడియని ఎఫెసీ 4:30 లో పౌలు వ్రాసినప్పుడు ఆయన వ్యక్తిత్వాన్ని బయలుపరచెను.

పరిశుద్ధాత్ముడు దైవత్వమును కలిగియున్నాడు. ఉన్న దేవుడు ఒక్కడే అయినను ఆయన ముగ్గురు మూర్తులై యున్నాడని బైబిలు బోధించుచున్నది. దైవత్వములోని వ్యక్తులగు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు ముగ్గురు దేవుని నిత్య ప్రత్యేకతలను సూచించుచు ఒండొరులు సమానులై యున్నారు. బైబిలునందు తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, పరిశుద్ధాత్ముడైన దేవుడు అని మూడు ప్రత్యేకనామములు మనకు కనబడుచున్నను, ఈ ముగ్గురు ఏకమై ఒకే దేవుడై యున్నారని దైవవేదము మనకు బోధించుచున్నది. ఆయన ముగ్గురై యున్న దైవ త్రియేకుడు.

పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నట్లు బైబిలు మనకు విశదముగ బోధించుచున్నది: అపొస్తలుల కార్యములు 5వ అధ్యాయములో అననీయ, సప్పీరాలను దంపతులను గూర్చి మనము చదువగలము. పేతురు అననీయను చూచి, "అననీయా, నీభూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను?........నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధమాడితివని వానితో చెప్పెను" (అపో.కా. 5:3,4). అననీయ పరిశుద్ధాత్ముని మోసగించుటలో దేవునితోనే అబద్ధమాడెనని పేతురు యిక్కడ చెప్పెను. "మీరు వినుటమట్టుకు విందురుగాని గ్రహింపనే గ్రహింపరు; చూచుటమట్టుకు చూతురు గాని కాననేకానరని యీ ప్రజలయొద్దకు వెళ్ళి చెప్పుము. ఈ ప్రజలు కన్నులార చూచి చెవులార విని మనసారా గ్రహించి నావైపు తిరిగి నావలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వియున్నది. వారు చెవులతో మందముగా విని కన్నులు మూసికొని యున్నారు అని పరిశుద్ధాత్మ యెషయా ప్రవక్తద్వారా మీపితరులతో చెప్పిన మాట సరియే"యని అపో.కా.

28:26,27 లో వ్రాయబడి యుంటే, ఆ మాటలనే యెహోవా పలికినట్లు యెషయా 6వ అధ్యాయములో వ్రాయబడి యున్నది. పరిశుద్ధాత్ముడు తండ్రి, కుమారులతో సమానత్వము గలవాడని మత్తయి 28:19 వలన గ్రహించుకొనగలము : "కాబట్టి మీరు వెళ్లి సమస్తజనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మ మియ్యుడి" యని యేసు తన అపొస్తలుల నాజ్ఞాపించెను. "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడై యుండును గాక" యని పలుకుచు అపో. పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రికను ముగించెను.

పరిశుద్ధాత్ముని ప్రత్యేక లక్షణములు ఆయన దైవత్వమును నిరూపించుచున్నవి. ఆయన నిత్యుడగు ఆత్మయని హెబ్రీ 9:14 లో వ్రాయబడి యున్నది. ఆయన సమస్తమును ఎరిగినవాడని 1కొరింథి 2:10-11లో వ్రాయబడి యున్నది. ఆయన సర్వాంతర్యామి, అనగా అన్నిచోట్ల యున్నవాడని దావీదు యిట్లు చెప్పెను: "నీ ఆత్మ యొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారి పోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళ మందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు" (కీర్తన 139:7-8). ఆయన పేరునుబట్టి ఆయన పరిశుద్ధత తెలియజేయబడుచున్నది: ఆయన పరిశుద్ధ ఆత్మయై యున్నారు.

పరిశుద్ధాత్ముడు సృజింపబడిన వ్యక్తికాదు. ఆయన ఆదినుండియు దేవుడై యుండెను. ఆదియందు దేవుని ఆత్మ జలములపై అల్లాడుచుండెను అని ఆదికాండము 1:3లో వ్రాయబడి యున్నది. పరిశుద్ధాత్ముడు దేవుడు వినియోగించు ఒక శక్తి మాత్రమే కాదు. పరిశుద్ధాత్ముని నుండి ఆయన వ్యక్తిత్వమును, దైవత్వమును, తండ్రి కుమారులతో గల సమానత్వమును లేకుండజేయు బోధ అబద్ధ బోధయై యున్నది.

పరిశుద్ధాత్ముడు మనలో నివసించునని లేఖనములు బోధించుచున్నవి. "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" యని 1కొరింథి 3:16 లో వ్రాయబడి యున్నది. మరల "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా?" యని 6:19లో వ్రాయబడి యున్నది. పరిశుద్ధాత్మ దేవుడు మనలో నివసించవలెనన్న మనము పరిశుద్ధత కలిగి యుండవలెను. యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించి, ఆయన మాటల

నుబట్టి పాపమును విసర్జించి క్రీస్తు అను గ్రహించు పరిశుద్ధత కొరకు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన యెడల పరిశుద్ధుడైన దేవునితో మనకు సహవాసము లభించును.

## సంఘము యొక్క ధనము
## ( Finances of the Church)

అననీయ, సప్పీరాల కాలము నుండిసంఘము ధన సంబంధమైన సమ స్యలను ఎదుర్కొనుచునే యున్నది. సంఘాల్లో చేయబడే బోధలు ఎక్కువ కానుకల నిచ్చుటను గూర్చే ఉంటాయి. యేసుప్రభువు ఈ లోకంలో యుండగా చేసిన బోధలలో ఎక్కువ భాగం మన భౌతిక దీవెనలను సద్వినియోగం చేసి కొనుటను గూర్చే యున్నాయని అంచనా వేయవచ్చును. యివన్నీ మనం ఎదొర్కొను వాస్తవములే. ఏ స్థానిక సంఘమైనా తన ఆర్థికవనరులను సద్వినియోగం చేయు టకు సంకల్పించకుండా యుంటే అది విఫలమగును. ఆర్థిక విషయాల్లో నేను నేర్పరిని కాను గాని సహాయకరంగా యుండుటకు ఇక్కడ కొన్ని సలహాల నిచ్చు చున్నాను.

**బడ్జెట్‌ను గూర్చిన ప్రణాళిక :**

దేనికైనా సరియైన సంకల్పము లేకపోతే యేదీ సాధించలేము. ఒకడు క్రైస్తవుడు కాగోరుచున్నట్లయితే యేమి చేయాలో క్రొౌనిబంధన అతనికి రక్షణ ప్రణాళికను బోధించుచున్నది. అలాగే ఆరాధన విషయంలో కూడాను. అయితే క్రీస్తు యొక్క గొప్ప ఆజ్ఞను అమలుపరచు విధానము మానవుల విజ్ఞతకే వదిలివేయ బడింది. ప్రతి స్థానిక సంఘానికి దేవుడు ఆజ్ఞలు జారీ చేస్తూయుంటే, వాటన్నిటిని చదివి అమలు పరచడానికి స్థలం, సమ యం చాలదు.

సంవత్సరానికి సరిపడే బడ్జెట్‌ను తయారు చేయడానికి సంఘ సభ్యుల నుండియే బడ్జెట్ కమిటీని ఎంచుకోవాలి. ఆ కమిటీ సభ్యులుమారుచు యుండ వచ్చును. కొన్ని సంఘములు తమ పరిచార కులందరినీ ఈ కమిటీలో నియమిస్తారు. అయినను స్థానిక సంఘములో యున్న వ్యాపారవేత్తల అనుభవాన్ని ఇందు విషయం లో వినియోగిస్తే తప్పేమీ యుండదు.

**బడ్జెట్ భాగములు :**

బడ్జెట్ అంతయు నాలుగు భాగ ములుగ చేసుకోవాలి. 1. సువార్త ప్రకటన 2. ధర్మ కార్యములు 3. సంఘ కార్యకలా పములు 4. బిల్డింగ్ నిర్వహణ మొదలు గునవి.

ఈ లోకానికి సువార్తచాటుట

సంఘము యొక్క ముఖ్యవిధి గనుక సువార్త ప్రకటన కొరకు సంఘాదాయములోఎక్కువభాగము వినియోగించబడాలి. నిజానికి 60% ఇందు విషయమై వినియోగింపబడితే మంచిది. సంఘాదాయములో 10% ధర్మకార్యములకు వినియోగింపబడ వచ్చును. ఈ ధర్మకార్యములలో విధవరాండ్రకు, అనాధలకు, పేదలకు యిచ్చే సహాయం వస్తాది. సంఘ కార్య కలాపములకు 10% వినియోగింపబడ వచ్చును. ఇందులో ఆఫీసు పనివారికి, ఆలయాన్ని శుభ్రపరచేవారికి, కరెంటు వగయిరా ఖర్చులు వస్తాయి.

ప్రతి స్థానిక సంఘము తమ బిల్డింగ్ కొరకు లేదా దాని అభివృద్ధి కొరకు కొంత ధనము కేటాయించాలి. నూటికి 20% బిల్డింగ్ పనులకొరకు కేటాయించితే మంచిదని నాయభిప్రాయము. అయినను యిది ప్రతిస్థానిక సంఘమునకు వేర్వేరుగా యుండును ఏదైనా స్థానిక సంఘము క్రొత్త ఆలయమును నిర్మించుచున్నట్లయితే ఆ సంవత్సరము ఎక్కువ శాతం దాని కొరకే వినియోగిస్తారు. నిర్మాణము పూర్తి అయిన తరువాత దానికొరకు కేటాయించిన సొమ్ము పలు ప్రాంతాలలో సువార్త కొరకు వినియోగించవచ్చును.

కొన్ని సంఘముల ఖర్చులు యధావిధిగానే ప్రతి సంవత్సరముండును. గనుక వారు పెద్ద మార్పులు చేసికోరు. వారిచ్చే జీతములు, సంఘఖర్చులు బిల్డింగ్ నిర్వహణ ఖర్చులు మామూలుగానే యుండును. బడ్జెట్‌ను అంచనావేయునప్పుడు ఇట్టి ఖర్చులన్నిటినీ పరిగణలోనికి తీసికోవాలి.

బడ్జెట్‌ను తయారు చేసిన తరువాత ఆ కమిటీవారు దానిని పెద్దలకు, పరిచారకులకు అందజేయాలి. అందులో వున్న ప్రతి అంశము, దానికి కేటాయించిన నిధులను గూర్చి వారాలోచిస్తారు. చర్చిస్తారు. భేదాభిప్రాయములున్నట్లయితే, పెద్దలు యేమిచెబితే దానిని బట్టియే అది అమలుపరచబడాలి.

పెద్దలు దానిని ఆమోదించిన తరువాత దానిని సంఘమునకు తెలియజేయాలి. ప్రతి సభ్యుడు బడ్జెట్‌ను గూర్చి తెలిసికొని దాని కొరకు ప్రార్థించాలి. సంఘ సభ్యులందరు సంఘ బడ్జెట్‌ను గూర్చి ఎరిగి యుంటే, వారు తగు రీతిగ తమ కానుకలను పెంచగలరు.

**కానుకలిచ్చుటలో గుర్తుంచు కొనదగినవి :**

క్రైస్తవులు దేవునికిచ్చు కానుకలను గూర్చి సంకల్పించుకొనునప్పుడు దిగువ సంగతులను జ్ఞాపకముంచుకోవాలి.

ఎవరు ఇవ్వాలి? ప్రతివాడు (1కొరింథీ 16:2). అంటే ప్రతి క్రైస్తవుడు ఇవ్వాలి.

ఎప్పుడు ఇవ్వాలి ? ఆదివారమున

(1కొరింథీ 16:1,2).

ఇచ్చుటను గూర్చి ఎప్పుడు సంకల్పించాలి ? ఒక సంవత్సరము ముందుగానే నిశ్చయించుకోవాలి. (2 కొరింథీ 9:2)

ఎట్లు సంకల్పించుకోవాలి? ప్రత్యేక ప్రయోజనము కొరకు (2 కొరింథీ 9:7). క్రమప్రకారము ఇయ్యాలి. గజిబిజిగా ఇయ్యకూడదు. అకస్మాత్తుగా ఇచ్చుట దేవుని చిత్త ప్రకారమైనది కాదు.

ఎంత ఇయ్యాలి? ఒకడు వర్ధిల్లిన కొలది ఇయ్యాలి (కొరింథీ 16:1-2). యిది ఏలాగు నిశ్చయింపబడ్తాది? ధారళముగా, సమృద్ధిగా ఇయ్యాలి. (2 కొరింథీ 9:6).

ఒకడు ఎట్టి మనస్సుతో ఇయ్యాలి ? సంతోషముతో, ఉత్సాహముగా ఇయ్యాలి. సణుగుకొనకుండా, బలవంతముగా కాకుండా ఇయ్యాలి (2 కొరింథీ 9:7).

**సంఘమునకు రిపోర్టు :**

అనేక సంఘాలు తమ అదాయ రిపోర్టును సంఘమునకు తెలియజేయరు. గాని అది అట్లుండరాదు. ఆదాయరిపోర్టును నెలకొకసారి సంఘమునకు తెలియజేయుట మంచిది. దప దపాలుగా బోధకుడుగాని, పెద్దలలో ఒకరు గాని సంఘావసరతలను గూర్చి సంఘమంతటికిని తెలియజేయాలి. ఇచ్చుటలో అలక్ష్యము చూపుట సహజమే, గాని ఈ రిపోర్టుల వలన సభ్యులు హెచ్చరింపబడి తమ కానుకలను పెంచే రీతిగా ఆలోచిస్తారు. తాము ఇచ్చుచున్న సొమ్ము జ్ఞానయుక్తముగా ఖర్చు పెట్టబడుచున్నదని తెలిసికొంటే సభ్యులు సంతోషముతోయిస్తారు.

**చందాలెక్కించుట :**

ప్రతి ఆదివారమును చందా లెక్కించుటకు కొంతమంది సహోదరులకు బాధ్యత అప్పగించిలి. ఎవరికిబడితే వారు చందా తీసుకొని లెక్కించకూడదు. గనుక ఇద్దరు లేక ముగ్గురు కలిసి చందా లెక్కించి, పుస్తకాలలో జమచేయవలెను. సంఘమునకు బేంక్ ఎక్కొంటు వుంటే, సోమవారం ఉదయన్నే ఆ సొమ్ము బేంక్‌లో జమచేయబడాలి.

**ఖజానాదారుడు :**

నమ్మకమైన ఖజానాదారుని సంఘము ఏర్పరచుకోవాలి. అతడాస్థానములో సంవత్సరములతరబడి యుండరాదు. అట్లుండుట వలన ఆ స్థానము తన జన్మహక్కు అనే విధంగా అతడు భావిస్తాడు. అతనిని తప్పించుటకు చేసే ప్రయత్నాలను అతడు నిరసిస్తే, అతడు తన మీదకు అనవసరమైన సందేహాలను ఆహ్వానించుకొనును.

సంఘము యొక్క ఆర్థిక రికార్డులను ప్రతి సంవత్సరము ఆడిట్ చేయించుకోవలెను. సంఘ ఖజానా దారులు నిజానికి యధార్థపరులే ఆయినను, అకౌంట్లు

క్రమముగా ఆడిట్ చేయించు కొనుట వలన పొరబాట్లేమైనా జరిగి యుంటే అవి బయల్పడును; వాటిని సవరించుకొనుటకు వీలు పడును.

## యరొబాము భార్య, వినాశ వర్తమానికురాలు

**( Mss. Jeroboam, deliverer of a Message of Doom )**

**1 రాజులు 14:1 -18 :**

బైబిలులోని అనేక వ్యక్తుల వలె యరొబాము భార్య యొక్క జీవితం విశాదాంతమయ్యెను. ఆమెను గూర్చి 1 రాజులు 14వ అధ్యాయములో మాత్రమే చెప్పబడెను. ఆ వచనములు బహుహృదయారవిందములు. వాటిని మనం మరచిపోలేము.

ఏదైనా వివాహిత యొక్క జీవిత చరిత్రను పఠించేటప్పుడు ఆవ్యక్తి యొక్క కుటుంబ సంబంధములు, తదితర సమాచారము అంత మనం సంగ్రహించాలి. మొదటిగా యరొబాము రాజు యొక్క జీవిత చరిత్రను సంగ్రహింతము. తదుపరి 1 రాజులు 14వ అధ్యాయములోని సంఘటనలకు దారి తీసిన వాటిని గమనించుదాము.

రాజైన సొలొమోనుమరణించగా అతని కుమారుడైన రెహబాము రాజయ్యెను. సొలొమోను రాజు మరణవార్త విని ఐగుప్తులో తలదాచుకొనుచున్న యరొబాము తిరిగి వచ్చెను (1 రాజులు 11:40). ఇశ్రాయేలీయుల సమాజమును, యరొబామును తమ భారములు తగ్గించుమని వేడుకొనుటకు క్రొత్తరాజు దగ్గరకుపోయిరి. రాజు తమ కోరిక నెరవేర్చిన యెడల రాజును వినయ విధేయతతో వెంబడించెదమని చెప్పిరి అయితే రెహబాము వారి భారములు తగ్గించకపోగా వాటిని హెచ్చించెను (1 రాజులు 12:12-14).

ఇశ్రాయేలులో ఉత్తరముననున్న పదిగోత్రములవారు యరొబామును తమ రాజుగా చేసికొనిరి (1రాజులు 11:34 -36). సొలొమోను చేసిన పాపమును బట్టి పది గోత్రములు వారు యరొబామును వెంబడింతురని ప్రవక్తయైన అహీయా ద్వారా దేవుడు చేసిన ప్రవచనము యొక్క నెరవేర్పు యిది (1 రాజులు 11:29 -39). ఇశ్రాయేలీయులు యెరూషలేముకు వెళ్లి దేవాలయములో ఆరాధింపనక్కరలేని విధముగా యరొబాము రెండు బంగారు దూడలను చేయించి ఒక దానిని దానులోను, రెండవ దానిని బేతెలులోను యుంచెను. మరియు రాజైన యరొబాము లేవీయులు కాని వారిని యాజకులుగా నియమించెను. వారు అతడు చేయించిన ప్రతిమలకు దహనబలులునర్పించుటకు వారిని నియమించెను.

ఇది యిట్లుండగా కొంత కాలాని కి యరొబాము కుమారుడైన అబీయా కాయిలాపడెను. అతడు ఇశ్రాయేలు మీద రాజుగునని ప్రవచించిన అహీయాను యరొబాము జ్ఞాపకము చేసికొనెను. ఇప్పుడు తనకుమారులలో ఒకడును, ప్రజల అభిమానమును పొందినవాడునైన అబీయా రోగియాయెను. తన కుమారుని ఆరోగ్య విషయమై రాజు ప్రవక్త నుండి సమాచారము తెలిసికొన గోరెను. అందువలన యరొబాము తన భార్యను ప్రవక్త యొద్దకు మారువేషములో పంపగోరెను. ప్రవక్తయైన అహీయా ముసలివాడై దృష్టిమాంద్యము గల వాడై యుండెను. మారు వేషములో ప్రవక్త యొద్దకు ఒక సామాన్య స్త్రీవలె యరొబాము భార్య సామాన్యులు యిచ్చు కానుకలను తీసికొని వెళ్లెను. యిది ఆశ్చర్యము ! ఒక ప్రక్క దేవుడు తమ వేషధారణను గుర్తించ లేడను కొనడం ఆశ్చర్యం. తన భర్త చెప్పిన విధముగా యరొబాము భార్యనడుచుకొనెను. ఆమె పది రొట్టెలును. అప్పములును ఒక బుడ్డి తేనెయు పట్టుకొని ఒక రైతు భార్య వలె వెళ్లెను.

యరొబాము భార్య ప్రవక్త యింటికి రాకముందే దేవుడు ఆమె రాకను గూర్చి మారు వేషమును గూర్చి అహీయాకు తెలియజేసెను. అంతేగాక ఆమెకు విషాద వర్తమానమును కూడ తెలియజేయుమని దేవుడు అతనికి చెప్పెను. ఆమె యింటికి తిరిగి పోయి తన పాదములు పట్టణములో ప్రవేశించునప్పుడే తన బిడ్డ చనిపోవును. మరియు యరొబాము దేవుని ఆజ్ఞలను మన:పూర్తిగా అనుసరింపక, ఆయనను విసర్జించి యితర దేవతలను పోత విగ్రహములను పెట్టుకొని యున్నందున యరొబాము సంతతిలో మగవారందరిని కుక్కలుతినును. మరియు అబీయా మాత్రమే సమాధిచేయబడునని అతడామెతో దేవుని మాటలు చెప్పెను. "ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యరొబాము సంబంధులలో ఇతని యందు మాత్రమే అనుకూలమైన దానిని కనుగొనెను. గనుక యరొబాము సంతితి వారిలో ఇతడు మాత్రమే సమాధికి వచ్చును" (1రాజులు 14:13). యరొబామునకు ముందున్న వారందరికంటె అతడు అధికముగా దుష్టత్వము జరిగించెను.

యరొబాము దుష్టత్వము వలన తనకుమారుడైన అబీయా తన కాలమునకు ముందే చనిపోయెను. ఇశ్రాయేలీయులు నాశనమవుదరనియు అతని కుమారులలో ఒక్కడు తప్ప అందరు సమాధికి చేరుకొనకుందురనియు ప్రవచింపబడెను. యరొబాము భార్య తన యింటికి తిరిగి వెళ్లుచుండగా బహుభారమైన హృదయముతో వెళ్లెను. ఆమె పట్టణములో

ప్రవేశించగానే తన కుమారుడు చని పోవునని ఆమె ఎరుగును. అతడు రోగియై యుండగా ఆమె ఆఖరిగా అతని చూచెను గాని మరొ కమారు ఆమె చూచుసరికి అతడు మరణించి యుండును. అంతేగాక తన భర్త యొక్క దుష్టత్వము వలన ఇట్టికీడంతయు సంభవించెనని అతనికి ఆమె చెప్పవలసి వచ్చెను.

**నేర్చుకొన దగిన పాఠములు**

**యరొబాము భార్య అతనికి విధేయురాలై యుండెను:**

యరొబాము దంపతుల మధ్య జరిగిన సంభాషణ యొక్క పూర్తి వివరములు మనకు తెలియవు. ఆమె మారు వేషము వేసికొని ప్రవక్త దగ్గరకుపోయి తన కుమారుని గూర్చి తెలిసికొనుమని అతడు ఆమెకు చెప్పినట్లు మాత్రమే మనకు తెలుసు. మారు వేషములో వెళ్లుటను గూర్చిన ఆమె అభిప్రాయము లెట్లుండెనో మనకు తెలియదు. తన భర్తయొక్క మాట చొప్పున "యరొబాము భార్య అప్రకారములేచి షిలోహునకు పోయి అహీయాయింటికి వచ్చెను" అని వాక్యము చెప్పుచున్నది (1రాజులు 14:4). ఆమె తన భర్త యొక్క మాటలను విధేయతతో అనుసరించెను.

ఏదెనువనములో యిచ్చిన చట్టమునే దేవుడు 21వ శతాబ్ధములో యున్న స్త్రీలకు యిచ్చెను (ఆదికా 3:16). భార్యలు తమ భర్తలకు లోబడియుండ వలెనని దేవుడు చెప్పిన ఆజ్ఞలో మార్పు లేదు. అపో.పౌలు భార్యభర్తల సంబంధమును, క్రీస్తుకు సంఘముకు యున్న సంబంధముతో పోల్చియిట్లు చెప్పెను:

"స్త్రీలారా ప్రభువునకు వలె మీ సొంత పురుషులకులోబడి యుండుడి. క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై యున్నాడు. సంఘము క్రీస్తుకులోబడి నట్లుగా భార్యలు కూడా ప్రతి విషయములోను తమ పురుషలకులోబడవలెను. పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి అదికళంకమైనను ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను నిర్దోషమైనదిగాను మహిమ గల సంఘముగాను అయన తన యెదుట నిలువ బెట్టుకొనవలెనని వాక్యముతో ఉదకస్నానము చేత దానిని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై తన్ను తాను అప్పగించుకొనెను. అటువలె పురుషులు కూడ తమ సొంత శరీరము వలె తమ భార్యలను ప్రేమింపబద్ధ యున్నారు. తన భార్యనుప్రేమించువాడు తన్నుతాను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించిన వాడెవడును లేదు గాని ప్రతి వాడును దానిని పోషించి

సంరక్షించుకొనును. మనము క్రీస్తు శరీరమునకు అవయవములై యున్నాము. గనుక ఆలాగే క్రీస్తు కూడ సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు. ఈ హేతువు చేత పురుషుడు తన తండ్రిని తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారిద్దరు ఏక శరీరమగుదురు. ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తును గూర్చియు సంఘమును గూర్చియు చెప్పు చున్నాను. మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తనునువలె తన భార్యను ప్రేమింపవలెను, భార్యయైతే తన భర్త యందు భయము కలిగి యుండునట్లు చూచుకొనవలెను" (ఎఫెసీ 5:22 –33).

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నారు. ఆలాగే భర్త భార్యకు శిరస్సై యున్నాడు. ఇట్టి సంబంధము వలన సంఘము క్రీస్తుకును భార్యభర్తకునులోబడి యుండాలి. క్రీస్తు సంఘమును ఏలాగు ప్రేమించెనో భర్త కూడ భార్యను ప్రేమిం చాలి. తన సొంతశరీరమువలె భర్తభార్యను ప్రేమించినప్పుడు ఆమె యిష్టపూర్వకముగా ప్రేమపూర్వకముగా అతనికి విధేయురాలై యుండును.

విచారం యేమంటే, కొందరు ఈ సూత్రములను మరచి తమ భార్యలను హింసింతురు. అట్టి వారి భార్యలు వారిని సన్మానించరు. అయితే భర్త ఆమెను సరిగా చూడకపోయినను భార్య భర్తకులోబడి యుండుట ఆమె యొక్క విధి. దేవుని వాక్యానికి విరుద్ధమైన వాటిని చేయుమని భర్త బలవంతము చేసినప్పుడు మాత్రమే ఆమె అతనికి అవిధేయత చూపించవచ్చును (ద్వితీ 3:6–8; మత్తయి 19:29, మత్తయి 10:37; అపొ.కా. 5:39). మనం పాతని బంధనకాలంలో లేకపోయినను, అందలి సూత్రము ఈనాటికి వర్తించును.

నీవు యరొబాము భార్యవలె యున్నావా? నీవు నీభర్తకు లోబడి యున్నావా? ఎఫెసీ పత్రికలో పౌలు చెప్పిన రీతిగా భర్తను ప్రేమించి అతనిని గౌరవించుచున్నావా?

**యరొబాము భార్య భారమైన హృదయము గలది :**

యరొబాము తన భార్యను మారు వేషములో ప్రవక్తయైన అబీయా దగ్గరకు పంపించి మోసము చేయుటకంటే, తానే స్వయముగా ప్రవక్త దగ్గరకు పోయి మారు మనస్సును ప్రకటించి యుంటే అతని భార్యకు అంతభారమైన హృదయము కలిగి యుండక పోవును. దావీదు వలె యరొబాము దేవుని హృదయపూర్వకముగా అనుసరించిన యెడల అతని రాజ్యము అతనికిని అతని సంతతికిని స్థిరపరచుదునని దేవుడు యరొబాముకు వాగ్దానము చేసారు. "నేనునీకాజ్ఞాపించిన దంతయు నీవు విని, నామార్గముల ననుసరించినడుచుచు నా దృష్టికి అనుకూలమైన దానిని జరిగించుచు నా సేవకుడైన దావీదు చేసినట్లు నాకట్టడ

లను నా ఆజ్ఞలను గైకొనిన యెడల నేను నీకు తోడుగా ఉండి దావీదు కుటుంబమును శాశ్వతముగా నేను స్థిరపరచినట్లు నిన్నును స్థిరపరచి ఇశ్రాయేలు వారిని నీకు అప్పగించెదను" అని దేవుడతనికి తెలియజేసెను (1 రాజులు 11:38-39). గాని నేడున్న అనేకులవలె యరొబాము దేవునిని గాక సాతానును అనుసరించుటకు ఎన్ను కొనెను. బెత్షెబ విషయంలో దావీదు మారు మనస్సు పొందగా ఆయన ఎట్లు అతని క్షమించారో అట్లే యరొబాము మారుమనస్సు పొంది యుంటే అతని కుమారుడు చావక యుండునేమో.

దేవునికి భయపడు జనాంగమునకు రాణివలె తన జీవితకాలమంతయు జీవించుటకుబదులు యరొబాము భార్య, తన భర్తకు, సంతతికి, రాజ్యమునకు సంభవింపబోవు ఘోరనాశనమును గూర్చి తెలియజేయవలసి వచ్చెను. ఆమె తన యింటికి చేరుకోగానే తన కుమారుడు చనిపోవునని కూడ ఆమె ఎరిగి యుండెను.

ప్రతివ్యక్తి తన జీవితములో కొన్ని క్లిష్టపరిస్థితులనెదుర్కొన వలసి వచ్చును (యోహాను 16:33; అపొ.కా. 14:22). "క్రీస్తు యేసునందుసద్భక్తితో బ్రదుకనుద్దేశించువారందరు హింసలు పొందుదురు" (2 తిమో 3:12) దేవునిననుసరిస్తు ఆయన అజ్ఞలకులోబడువారందరు పరీక్షింపబడుదురు. కొన్ని శ్రమలు ఇతరులవలన కలుగును, కొన్ని తమపాప ఫలితములగును. ఈలోకశ్రమల వలన మనము దేవునికి మరింత దగ్గరగా చేరుకోవాలి (రోమా 8:17-18; 1 పేతురు 4:13). లేదా వాటివలన మనం దేవునికి దూరమైపోతాము. మనము ఆయనకు దగ్గరగా యుంటే అన్ని శ్రమలలోను ఆయన మనకు సహాయం చేస్తారు (2 కొరింధీ 1:3-4; 2 తిమో 2:11-12; 1 పేతురు 5:5-7).

**యరొబాము భార్య దేవుని మోసగించ యత్నించెను:**

రాణివలెగాక ఒకరైతు భార్య వేషముతో దేవుని ప్రవక్తను మోసగించగలమని నమ్ముటలో యరొబాము దంపతులు బుద్ధిహీనులైరి. సర్వజ్ఞానియైన దేవుడు మారువేషములో యున్న మోసమును గూర్చి తన ప్రవక్తను హెచ్చరించదనుకొనడం బుద్ధిపొరబాటు. దేవునికి సమస్తము ఎరుకేయని బైబిలు బోధించుచున్నది. ఆయన అన్ని చోట్ల యున్నవాడు గనుక సమస్తమును ఆయన ఎరుగును.

దావీదు దీనిని విపులముగా చెప్పుచున్నాడు: "యెహోవానీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నామనస్సును గ్రహించుచున్నావు. నా

నడకను నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు. నాచర్యలనన్నిటిని నీవు బాగుగాతెలిసికొని యున్నావు. యెహోవా మాట నానాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసి యున్నది" (కీర్తన 139:1-4). దేవుడు మన తలంపులను, చర్యలను మనకంటే బాగాగా ఎరుగును.

మన జీవిత వివరాలన్నీ చిన్నవేమి పెద్దవేమి అన్నీ దేవునికి తెలుసు. "రెండు పిచ్చుకలు కాసుకు అమ్మబడునుగదా; అయినను మీ తండ్రి సెలవు లేక వాటిలో ఒకటైనను నేలనుపడదు. మీ తల వెండ్రు కలన్నియు లెక్కింపబడి యున్నవి. గనుక మీరు భయపడకుడి" యని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 10:29-31). "నరుని మార్గములను యెహోవా ఎరుగును. వానినడతలన్నిటిని ఆయన గుర్తించును" (సామెతలు 5:21).

దేవుడు మనకు స్వేచ్ఛయిచ్చారు గనుక దేనినైనా చేయుటకు ఆయన బలవంతము చేయరు (ప్రకటన 22:4). యేమి చేయాలో ఎటువెళ్లాలో మనకు మనమే నిర్ణయించుకోవాలి అయితే ఏదైనా సంభవించకముందు మన ప్రతి క్రియ ఎట్లుండునో దేవునికి తెలుసు. మనుష్యు లు కొందరిని కొంతకాలము మట్టుకు మోసగించవచ్చును. గాని మనం దేవుని మోసగించలేము. సాధారణంగా మనం ఎవరిని మోసగింపయత్నించుచున్నామో వారే మన మోసాన్ని కనుగొంటారు. మన హృదయం ఈలోకాశలతో నిండి యుం డగా, క్రైస్తవులమనినటించవచ్చును. గాని దేవునికి అంతా తెలుసు (యాకోబు 2:10; 4:4).

నీవు యరొబాము భార్యవలె యు న్నావా? నీవు దేవుని, యితరులను కూడ మోసగించయత్నించుచున్నావా? రాబోవు నాశన వర్తమానాన్ని ఆమె అందించవలసి వచ్చెను. వారు దేవుని మోసగింప యత్నిం చినందున తన భర్తకు, అతని సంతతికి, రాజ్యముకు సంభవింపబోవు నాశనమును గూర్చిన వర్తమానమును ఆమె తన భర్తకే తెలియజేయవలసి వచ్చెను.

- బోనీ రష్మోర్

## కొనియాడదగిన హన్నా

ఎఫ్రాయిము మన్యమందు రామ తయిమ్సోఫీము పట్టణమునకు చెందిన ఎల్కానా అను లేవీయుడు ఒకడుండెను. అతడు కహాతువంశానికి చెందిన వాడు (1 దినవృ 6:22-27). అతనికి ఇద్దరు భార్యలు. వారిపేర్లు హన్నా, పెనిన్నా. అనగా భావం, దయ, ముత్యము. పెనిన్నాకు పిల్లలున్నారు గాని హన్నా గొడ్రాలు. ప్రతి యేటా కుటుంబమంతా షిలోహునందలి దేవుని ఆలయమునకు వెళ్లి అక్కడ బలి

అర్పించి ఆరాధించేవారు. ఎల్కానా, హన్నాను ప్రేమించేవాడు. "యెహోవా ఆమెకు సంతులేకుండా చేసి యున్న హేతువును బట్టి ఆమె వైరియగు పెనిన్నా వల్ల ఆమె హృదయం దు:ఖపడెను. ఆమె విసికి కలత చెంది బహుగా ఏడ్చి దేవుని సన్నిధిని ప్రార్ధించెను. దేవుని సన్నిధిలో ఒక మ్రొక్కుబడి చేసికొంది. "సైన్యముల కధిపతియగు యోహోవా, నీ సేవకు రాలినైన నాకు కలిగిన శ్రమను చూచి నీ సేవకురాలనైన నన్ను మరువక జ్ఞాపకము చేసికొని, నీ సేవకురాలనైన నాకు మగ పిల్లను దయ చేసినయెడల, వాని తల మీదికి క్షౌరపు కత్తి యెన్నటికి రానియ్యక, వాడు బ్రదుకు దినములన్నిటను నేను వానిని యెహోవా వగు నీకు అప్పగింతునని మ్రొక్కుబడి చేసికొనెను. ఆమె యెహోవా సన్నిధిని ప్రార్ధన చేయుచుండగా ఏలి ఆమె నోరు కనిపెట్టుచుండెను, (1సమూ 1:10-11).

దు:ఖితురాలైన హన్నా తన ఆత్మను దేవుని సన్నిధిలో క్రుమ్మరించుకొనినపుడు దేవుడు ఆమె ప్రార్ధన ఆలకించారు. ఆమె గర్భవతియై కుమారుని కన్నది. " నేను యెహోవాకు మ్రొక్కుకొనివీనినడిగితినని ఆతనికి సమూయేలు అని పేరు పెట్టింది".

(20 వ) ఆమె ఆతనికి పాలు మాన్పించి ఆతనిని దేవుని సన్నిధికి తీసి కొని వచ్చి యాజకుడైన ఏలీతో ఇలా అంది: "ఈ బిడ్డను దయచేయుమని యెహోవాతో నేను చేసిన మనవినిబట్టి ఆయన నాకనుగ్రహించెను. కాబట్టి నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్టించు చున్నాను. తాను బ్రతుకు దినములన్నీయు వాడు యెహోవాకు ప్రతిష్టితుడని చెప్పెను, "ఈ బిడ్డను దయచేయుమని యెహోవాతో నేను చేసిన మనవిని ఆయన నాకనుగ్రహించెను. కాబట్టి నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్టించుచున్నాను, తాను బ్రదుకు దినములన్నిటను వాడు యెహోవాకు ప్రతిష్టితుడని చెప్పెను. అప్పుడు వాడు యెహోవాకు అక్కడనే మ్రొక్కెను హన్నాలోని గొప్ప కలవరము, దు:ఖము ఆమెను దేవునికి దగ్గరగా తీసుకు వచ్చింది. యాకోబు 4:8లో యాకోబు అంటాడు " దేవుని యొద్దకు రండి అపుడాయన మీ యొద్దకు వచ్చును". మనం ఎదుర్కొనే శ్రమలు, బాధలు మన విశ్వాసానికి పరీక్ష. నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధపరచబడునదిగదా! దానికంటె అమూల్యమైన మీవిశ్వాసము ఈ శోధన చేత పరీక్షకునిలిచినదై యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పుడు మహిమయు ఘనతయు కలుగుటకు కారణ మగును (1 పేతురు 1:7). కీర్తనలు 50:15లో ఇలాచెప్పబడింది "ఆపత్కాలమున నీవునన్ను గూర్చి మొర్రపెట్టుము నేను నిన్ను విడిపించెదను నీవు నన్ను మహిమ పరచెదవు." ఇశ్రాయేలు రాజైన దావీదు

ఇలా పాడుచున్నారు: ప్రభువా నేను నీకు మొరపెట్టగా నీవు ఉత్తరమిచ్చితివి. "ప్రభువు కన్నులు నీతి మంతులు మీదను, ఆయన చెవులు వారి ప్రార్ధనల వైపును ఉన్నవి. గాని ప్రభువు ముఖము కీడుచేయు వారికి విరోధముగా ఉన్నది (1పేతురు 3:12). దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము; ఎవడైనను దేవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును (యోహాను 9:31).

నాజీరు చేయబడినవాడై దేవుని భయముతో ఆబిడ్డనుపెంచుటకు, వాని జీవితకాలమంతా దేవుని సేవించునట్లు వానిని పెంచుటకు హన్నా మ్రొక్కు కొంది. బాలుడైన వానికి దేవునికి మ్రొక్కడం తెలిసింది (28వ) "బాలుడు నడువలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైన పప్పుడు దాని నుండి తొలగిపోడు. (సామె 22:6). యోకెబెదు మోషేను దేవుని భయంతో పెంచింది. తన స్వంత తల్లి ద్వారా ఫరోకుమార్తె యొక్క కుమారుడుగా మోషే పెంచబడ్డాడు (నిర్గ 2:5-10) తిమోతిని అతని అవ్వ అయిన లోయి, తల్లి అయిన యునికేలు దేవుని భయంలో పెంచారు (2 తిమో 2:5). "............... ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" అని పౌలు ఎఫెసీ 6:4లో వ్రాస్తున్నారు.

హన్నా ఒక మగబిడ్డను అడిగింది, దేవుడు ఆమెకు మగ బిడ్డను ఇచ్చారు. ఆమె అతనికి సమూయేలు అని పేరు పెట్టింది. ఆమె బాలుడైన సమూయేలు ను దేవుని మందిరముకు తెచ్చి తన మ్రొక్కుబడి చెల్లించుకుంది. "ఈ బిడ్డను దయచేయుమని యెహోవాతో నేను చేసిన మనవిని ఆయన నాకనుగ్రహించెను.......... తాను బ్రతుకు దినములన్నింటను వాడు యెహోవాకు ప్రతిష్టతుడని చెప్పెను. అప్పుడు వాడు యెహోవాకు అక్కడనే మ్రొక్కెను," (1 సమూ 1: 27-28). తన బిడ్డనుండి దూరంగా ఉండడం ఒక తల్లికి కష్టమైనప్పటికి వాడు బ్రతుకు దినములన్నియు దేవునికి సేవ చేయాలనే ఉద్దేశంతో హన్నా తన కుమారుని దేవుని మందిరమునకు తీసుకు వచ్చింది "నీవు నీ దేవుడైన యెహోవాకు మ్రొక్కుకొనిన తరువాత ఆ మ్రొక్కుబడిని చెల్లించుటకు తడవు చేయకూడదు. నీదేవుడైన యెహోవా తప్పక నీ వలన దానిని రాబట్టుకొనును.అదినీకు పాపమగును". (ద్వితీ 23:21-22).

న్యాయాధిపతులలో ఒకడైన యెఫ్తా యెహోవాకు మ్రొక్కుకొన్నాడు ఎట్లనగా - నీవు నాచేతికి అమ్మోనీయులను నిశ్చయిముగా అప్పగించిన యెడల .......... నాయింటి ద్వారమునుండి

బయలుదేరి వచ్చున దేదో ............ దహనబలిగా దానినర్పించెదననెను (న్యాయాధి 11:29-40). అతని కుమార్తె ఆతని మ్రొక్కుబడి చొప్పున ఆతడు తన కుమార్తెను దేవునికిబలిగా అర్పించాడు "నీవు దేవునికి మ్రొక్కుబడి చేసికొనిన యెడల దానిని చెల్లించుటకు ఆలస్యము చేయకుము, బుద్ధిహీనులయందు ఆయనకు ఇష్టము లేదు" (ప్రసంగి 5:4,5).

ఏశావు నుండి పారిపోతూ యాకోబు కూడా ఒక మ్రొక్కుబడిచేసుకున్నాడు "నేను తిరిగి నా తండ్రి యింటికి క్షేమముగా వచ్చునట్లు దేవుడు నాకు తోడైయుండి తినుటకు ఆహారమును ధరించుకొనుటకు వస్త్రములను దయచేసిన యెడల యెహోవా నాకు దేవుడై యుండును. మరియు నిలిపిన ఈరాయి స్థంభముగానేను దేవుని మందిరమగును మరియు నీవు నాకిచ్చుయా వత్తులో పదియవంతు నిశ్చయముగా నీకు చెల్లించెదనని మ్రొక్కుకొనెను", (ఆది.కా. 28:20-22). హన్నా కొనియాడదగినది ఎందుకనగా తనకు కలిగిన అతివిలువైన దానిని దేవునికి ఇచ్చివేసింది. ఎందుకనగా కుమారులు యెహోవా ఇచ్చు స్వాస్థ్యము, గర్భఫలము దేవుడనుగ్రహించు బహుమానము కీర్త127:3. విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము తనకు ఒక్కడైయున్న కుమారుని దేవునికిచ్చుటకు సంకోచించ లేదు. (ఆది 22 అధ్యా)

"అబ్రహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను. ఎవడు ఆ వాగ్దానములు సంతోషముతో అంగీకరించెనోఆ అబ్రహాము మృతులను సయితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచినవాడై తన యేక కుమారుని అర్పించి ఉపమానముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను" (హెబ్రి 11:17-19). తన జీవనమంతా దేవునికి ఇచ్చిన పేదవిధవరాలిని యేసు ప్రభువు మెచ్చుకున్నారు (లూకా 21:4). "మీరు ప్రతి విషయము లో అనగా విశ్వాసమందును ఉపదేశమందును జ్ఞానమందును సమస్త జాగ్రత్తయం దును మీకు మాయెడలనున్న ప్రేమయం దును, ఏలాగు అభివృద్ధిపొందుచున్నారో ఆలాగే మీరు ఈ కృపయందు కూడ అభివృద్ధి పొందునట్లుచూచుకొనుడి," (2 కొరింధీ 7:9-7).

హన్నా తన కష్టసమయంలో దేవుని కృపా సింహాసనాన్ని ఆశ్రయించింది. బాలుడైన సమూయేలును దైవ భయంలో పెంచింది. వాడు బ్రతుకు దినములన్నీయు యెహోవాకు సేవ చేయునట్లు వానిని దేవుని మందిరమందు విడిచి తన మ్రొక్కుబడినిలుపుకొన్నది. ఆయన మనకు అనుగ్రహించిన అనేక విధములైన ఆశీర్వాదముల కొరకై మనము కూడా హన్నావలె ఎల్లపుడు

దేవునికి కృతజ్ఞత గలవారంగా ఉండాలి.

– కబిత గూటం.

## దేవుడు లోకము నెంతో ప్రేమించి యిచ్చెను
## ( Fearfully and Wonderfully Made)

పరమందాక దేవుడున్నారు! ఆయన ఎట్లుంటారు ? దేవుడు ప్రేమయై యున్నాడని మనం వక్కాణించాము. ఈ ముగింపుకు ఎట్లు వచ్చాము? బైబిలు నుండి దానికి రుజువులనిచ్చాము.

**ఈలోకము కఠినమైనదా?**

ఈలోకం, ప్రకృతి చాల క్రూర మైనవిగా కనబడుచుండగా ప్రేమయైన దేవుని యందు ఎందుకు విశ్వసించాలి? యని కొందరు అడుగుతారు. ప్రకృతిలో కఠిన పరిస్థితులున్నాయని మనం అంగీకరించకతప్పదు. తుఫానులు, భూకంపములు, రోగములు, బాధలు, వరదలు, మరణము వగయిరాలు ప్రకృతి కఠినమైనదని క్రూర మైనదని మనకు చెబుతాయి. అయితే వీటిని బట్టి మనం దేవుని ప్రేమను నిర్లక్ష్యము చేయరాదు. గొప్ప పర్వతశ్రేణులు, సారవంతమైన లోయలు, పంటభూములు, పక్షుల పాటలు, ఆశ్చర్యకరమైన సూర్యాస్తమయము, ప్రశాంత అడవులు, రంగు రంగుల పుష్పములు, భీకర సముద్రతరంగములు, తీరములు మొదలగునవన్నీ ప్రకృతిలో దేవుని ప్రేమ యొక్క చిహ్నములే.

**అబద్ధమతములు దేవుని క్రూరుడుగా చిత్రిస్తాయి :**

పాపము వలన దేవుడు మానవుని యెడల రౌద్రుడై యున్నాడని అబద్ధమతములు బోధిస్తాయి. వారికి దేవుడు క్రూరుడు. ఆయనను శాంతింప జేయడానికి మానవులు తమ శరీరాన్ని శిక్షించుకోవాలి. అందువలన అసత్య దేవుండ్లనారాధించు వారు ముండ్ల మీద కూర్చుందురు, తమ శరీరములను కోసికొని గాయపరచు కొందురు, గుహల లో యుండి తపస్సు చేతురు. ఆహారమును నిరాకరింతురు, నిప్పుల మీద నడతురు, తమ పిల్లలను బలియిత్తురు, ఇవన్నీ చేస్తే తమ దేవుడు శాంతింప జేయబడునని తలంతురు.

**దేవుని ప్రాధమిక లక్షణము ప్రేమ :**

పై నుదహరించిన అపోహలను బట్టి కొన్ని మతములు దయయే దేవుని ప్రాధమికలక్షణమని తలస్తారు. గాని ప్రేమయే దేవుని ప్రాధమిక లక్షణమని బైబిలు బోధించుచున్నది. "శాశ్వతమైన

ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను" అని దేవుడు ప్రకటించినప్పుడు (యిర్మియా 31:3), యిది ఎన్నడు మానవుడు వినలేని మాటయై యుండెను. ప్రకృతిలోను, ధార్మిక చింతనలోను మానవుడు కనుగొన లేని దానిని దేవుడే ప్రకటించారు. మనం ఆయనను వెదకినందున దేవుడు మనల్ని ప్రేమించుచున్నారని బైబిలు చెప్పుటలేదు సరిగదా ఆయన మనలను ప్రేమించి కృప చేత నిత్యమైన ఆదరణయు శుభ నిరీక్షణయు అనుగ్రహించెనని 2 థెస్స 2:16 చెప్పు చున్నది. కరుణాకటాక్షములను ఆయన కిరీటముగా మనకు ధరింపజేసియున్నాడని కీర్తన 103:14 చెప్పుచున్నది, "ఈ దేవుడు మనకు సదా కాలము దేవుడై యున్నారు; మరణము వరకు ఆయన మనలను నడిపించును".

**క్రీస్తే దేవుని ప్రేమ యొక్క గొప్ప ప్రత్యక్షత :**

క్రీస్తునను గ్రహించుట ద్వారా ఆయనకనుబరచిన ప్రేమను ఎరుగక పోతే దేవుని ప్రేమను గ్రహించుకొని వివరించుటకు చేయుప్రయత్నములన్నీ విఫలమగును. బైబిలులో బంగారు వచన మనబడు గొప్ప లేఖనము ఇట్లు చెప్పుచున్నది: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). 17వ వచనము కూడ చాల మంచిది. "లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు".

**దేవుడులోకము నెంతో ప్రేమించి, యిచ్చారు:**

పై లేఖన భాగములో అనేక గొప్ప సంగతులు బయలు పరచబడ్డాయి. మొదటిగా, దేవుడు లోకమును ప్రేమించారు. ఈ ప్రేమను బట్టి ఆయన యేమి చేసారు? ఆయన సీనాయి నుండి యెరూషలేము వరకు ప్రకటించారు, అంతేకాదు, ఆయన లోకమును ఎంతో ప్రేమించారంటే దాని కొరకు యిచ్చారు. ఆయన యేమియిచ్చారు? ఆయన బంగారమును, ముత్యములను ఇయ్యలేదు. వాటిని అంతకు ముందే మానవునికి యిచ్చా రు. గాని ఆయన తన కుమారుని యిచ్చారు. ఆయన కున్న అనేక కుమారులలో ఒకని కాదుగాని, ఆయన తన ఏకైకకుమారుని యిచ్చా రు. ఆయనను ఎట్లు యిచ్చారు? ఆయన మానవులమధ్యజీవించగల్గునట్లు ఆయనను పొత్తిగుడ్డలతో చుట్టి పశువుల తొట్టిలో పరుండబెట్టారు. ఆయన నజరేతుపట్టణములో యౌవ్వనునిగా పెరిగారు, "యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయ

యందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచు" పెరిగారు (లూకా 2:52).

**క్రీస్తు దేవుని యొక్క ప్రత్యక్ష స్వరూపము:**

ముప్పయవ యేట యేసు యొర్దానులో బాప్తిస్మము పొందెను. తదుపరి మూడు సంవత్సరముల మట్టుకు ఆయన ప్రజలకు బోధించెను. రోగులను స్వస్థపరచెను, గ్రుడ్డివారికండ్లు తెరిచెను, చనిపోయిన వారిని బ్రదికించెను, దయ్యములను వెళ్లగొట్టెను, మేలు చేయుచు సంచరించెను. "తండ్రి కుమారుని ప్రేమించుచు తాను చేయువాటినెల్లను ఆయనకు అగపరచుచున్నాడని" ఆయన చెప్పెను (యోహాను 5:20). మరియు "నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడని" ఆయన చెప్పెను (యోహాను 14:9). యేసు అదృశ్యదేవుని తత్వము యొక్క మూర్తిమంతమై యున్నాడని హెబ్రీ 1:3 చెప్పుచున్నది. గనుక దేవుడు క్రీస్తు ద్వారా తన్నుతాను లోకమునకు బయలు పరచుకొనెను. లోకముయెడల తన కున్న గొప్ప ప్రేమను బట్టి ఆయన అట్లు చేసెను.

**క్రీస్తు మరణంలో దేవుని ప్రేమ పూర్ణముగా బయలుపరచబడెను:**

క్రీస్తు యొక్క జననము, మంచి పనులు, బోధలు మొదలగునవన్నీ దేవుని ప్రేమను బయలు పరచెను, గాని క్రీస్తు సిలువపై మరణించే వరకు దేవుని ప్రేమ యొక్క సంపూర్ణ బయల్పాటును మనము గ్రహించుకొన లేదు. "మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను, దీని వలన దేవుడు మన యందుంచిన ప్రేమ ప్రత్యక్ష పరచబడెను. మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను". "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" (1యోహాను 4:9-10,19).

**దేవుని ప్రేమకు రుజువుగా క్రీస్తు తన ప్రాణమర్పించెను:**

ఏదెను వనములో ఆదాము పాపము చేసినప్పుడతడు చని పోయెను. మరియు లోకములోనికి మరణ మును ప్రవేశింపజేసెను. అయితే క్రీస్తు జగదుత్పత్తి మొదలుకొని వధింపబడి యున్న గొర్రెపిల్ల వలెయుండెనని ప్రకటన 13:8 తెలియజేయుచున్నది. అందువలన "నేను దాని మరల తీసికొనునట్లు నాప్రాణమును పెట్టుచున్నాను, దాని పెట్టుటకు నాకు అధికారము కలదు. దాని తిరిగి తీసికొనుటకు నాకు అధికారముకలదు , నాతండ్రి వలన ఈ ఆజ్ఞను పొందితినని" యేసు చెప్పెను (యోహాను 10:17-18).

తండ్రియొక్క ప్రేమను రుజువుగా యేసు తన ప్రాణమునర్పించుమని తండ్రి

అడుగుట ఘనతగా క్రీస్తు ఎంచెను. ఆయన తన ప్రాణమునర్పించుట ఒక ఏక్సిడెంటు కాదు, సరిగదా అది ఆయన చిత్తమునకు భిన్నమైనది కూడ కాదు. అట్లు చేయుటకు ఆయనే ఎంచుకొనెను. ఆయన తండ్రి కూడలోకమును ప్రేమించారు. వారు ఒండొరులను ప్రేమించారు. "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టు వానికంటె ఎక్కువైన ప్రేమగలవాడె వడును లేడు" అని యోహాను 15:13లో క్రీస్తు చెప్పెను. గనుక క్రీస్తు ఈ లోకములో యున్నపుడు మనలను గొప్పప్రేమతో ప్రేమించెను. "తండ్రినన్ను ఏలాగు ప్రేమించెనో నేనును మిమ్మును ఆలాగు ప్రేమించితిని" అని ఆయన చెప్పారు (యోహాను 15:9). "దేవుని కృప వలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించెను" అని హెబ్రీ 2:9 చెప్పుచున్నది.

**మరణము ద్వారా క్రీస్తు మరణ బంధకములను ఛేదించెను :**

ఆయన మరణములో ప్రవేశించుట వలన మరణము యొక్క ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి మరణముపై విజయము సాధించెను. (కొల్స 2:15). "మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను లేపెను" (అపొ.కా. 2:24). ఆయన సమాధిని జయించి లేచినప్పుడు మరణము యొక్కయు పాతాళము యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో యున్నవని ఆయన ప్రకటించెను (ప్రక 1:18). గనుక ఆయన పరిశుద్ధుల సమాధుల యొద్దనిలబడి, "పునరుత్థానమును జీవమును నేనే; నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికినాయందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికి చనిపోడు" అని చెప్పుచున్నారు (యోహాను 11:25, 26).

మరణము నొందుట ద్వారా "మన యతిక్రమములను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను మన సమాధానార్థమైన శిక్ష అతని మీదపడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొర్రెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడు తన కిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషమును అతని మీద మోపెను" (యెషయా 53:5,6).

తరువాయి

(టైటిల్ 3వ పేజీలో)

**క్రీస్తు మరణమును గూర్చి భయకంపితుడాయెను :**

తన ప్రాణమును మన విమోచన క్రయధనముగా అర్పించుటకు ఈలోకమునకు వచ్చినను, ఆయన ముఖాముఖిగా మరణము నెదుర్కొన్నప్పుడు దానిని గూర్చి భయపడి, "ఇప్పుడు నాప్రాణము కలవరపడుచున్నది; నేనే మందును? తండ్రీ ఈ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము; అయినను ఇందు కోసరమే వచ్చితినని" ప్రార్థించెను దుఃఖములో మునిగిపోయెను (మత్తయి 28:38). "తండ్రీ సాధ్యమైతే ఈగిన్నె నా యొద్దనుండి తొలగిపోనిమ్మని" గెత్సేమనే వనములో ప్రార్థించెను (మత్తయి 28:39). గాని దేవుడు మనలను ప్రేమించుచున్నందు వలన ఆగిన్నెను ఆయన నుండి తొలగించ లేదు. క్రీస్తు ప్రార్థించి పన్నెండు సేనా వ్యూహములకంటె ఎక్కువ మంది దూతలను తనను తప్పించుటకు పొంది యుండగలుగును (మత్తయి 26 : 53). గాని ఆయన తప్పించుకొనుటకు ఎంచకొనలేదు, ఏలయనగా ఆయన మనలను ప్రేమించారు.

**దేవుడాయన వేదనలను తొలగించలేదు :**

సిలువ వేదనను అనుభవిస్తు దాని నుండి ఉపశమనము కొరకు ఆయన పరలోకతండ్రిని వేడుకొనెను. గాని దేవుడాయన వేదనను తొలగించలేదు. ఒక మానవ మాత్రునిగా మరణించునట్లు ఆయన తన ముఖమును త్రిప్పివేసుకొనెను. "నా దేవా, నా దేవా నన్నేల చేయివిడిచితివి?" క్రీస్తు బిగ్గరగా అరచెను (మత్తయి 27:46). క్రీస్తు యొక్క అవసాన గడియలో దేవుడాయనను ఎందుకు విడిచిపెట్టారు? ఏలయనగా "దేవుడు లోకమునెంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయ కుమారునియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3 :16). క్రీస్తు యొక్క మరణములో దేవుని ప్రేమ యొక్క పొడవు, లోతు, వెడల్పు, ఎత్తు అన్నీ సంపూర్తిగా బయలుపరచబడెను. మహోన్నతమైన దేవుని ప్రేమకు స్తోత్రము !

## మీకొకగొప్పసదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.


**Satya Vani**

#7-9-35, Sambamurth Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722



RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004